# నిజం చెపుతాం
Nijam Cheputham
తెలుగు దినపత్రిక

సూర్యాపేట | మంగళవారం | 11-02-2025 | ఎడిటర్: కామళ్ల కాంతయ్య | సంపుటి: 3 | సంచిక: 359 | పేజీలు: 4 | వెల: రూ.1/-


### సమయం కోరిన విజయమ్మ, షర్మిల

సరస్వతి పవర్ కంపెనీలో తన పేరు మీద, తన భార్య భారతి, క్లాసిక్ రియాలిటీ పేరు మీద ఉన్న షేర్లను తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిల అక్రమంగా బదిలీ చేసుకున్నారని వైసీపీ అధినేత జగన్ ఎన్సీఎల్టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లోని ఎన్సీఎల్టీలో గత ఏడాది ఈ పిటిషన్ జగన్ వేశారు.

### ఇంట్రెస్టింగ్ థీమ్‌తో మూడో వన్డే..

ఇంగ్లండ్ తో మూడు వన్డేల సిరీస్ లో భాగంగా ఆఖరిదైన మూడో వన్డే బుధవారం నాడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుంది. అయితే, ఈ మ్యాచ్ ను ఓ ఇంట్రెస్టింగ్ థీమ్‌తో నిర్వహించనున్నట్లు తాజాగా ఐసీసీ ఛైర్మన్ జై షా సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. 'అవయవ దానం చేయండి... ప్రాణాలను కాపాడండి.



## ఫ్రాన్స్ చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- నేటి నుండి ప్రధాని మోదీ విదేశీ పర్యటన
- 12వ తేదీ వరకు ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన
- 14వ తేదీ వరకు అమెరికాలో మోదీ పర్యటన

ఫిబ్రవరి10,(నిజం చెపుతాం) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ చేరుకున్నారు. ఆయన నేటి నుండి 14వ తేదీ వరకు ఫ్రాన్స్, అమెరికాలో పర్యటించనున్నారు. ఫ్రాన్స్‌లో రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగుతుంది. ఈ పర్యటన నిమిత్తం భారత్ నుండి బయలుదేరిన ప్రధాని ప్యారిస్‌లో దిగారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఆరోసారి. ప్యారిస్‌లో అడుగుపెట్టిన ప్రధాని మోదీ 12వ తేదీ సాయంత్రానికి అమెరికాకు చేరుకోనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయన భేటీ కానున్నారు. పలు అంశాలపై వారి మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి.

## వరుస ఎన్కౌంటర్లతో... అన్నలు ఆగమాగం

- మావోయిస్టులపై ముప్పేట దాడులు
- అగ్రనేతల వేటలో బలగాలు
- దిక్కుతోచని స్థితిలో మావోయిస్టులు
- అమిత్ షా శపథం నెరవేరనుందా?

2



## ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించవద్దు

- గనులు, ఖనిజాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష
- వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచన
- ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను సరఫరా
- వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి10,(నిజం చెపుతాం) రాష్ట్రంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈరోజు ఆయన గనులు ఖనిజాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక రవాణా, తవ్వకాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద తనిఖీలు చేపట్టాలని, అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి అన్నారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి బాధ్యతలను కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించాలన్నారు.

### ఆ బాధ్యత హైడ్రాకు ఇవ్వాలి...

హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణా కట్టడి బాధ్యతను హైడ్రాకు అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని ఇసుక రీచ్‌ల వద్ద కెమెరాలు, సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక కోసం బుక్ చేసిన 48 గంటల్లోపు వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై దాడి అమానుషం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

- రంగరాజన్ మీద దాడిని తీవ్రంగా ఖండించిన కిషన్ రెడ్డి
- అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై దాడి అమానుషమని వెల్లడి
- ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు తావులేదని స్పష్టీకరణ



2

## పోలీస్ కస్టడీకి మస్తాన్‌సాయి



- యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు
- మస్తాన్‌సాయిని కస్టడీకి ఇవ్వాలని పోలీసుల పిటిషన్
- కస్టడీకి అనుమతించిన రాజేంద్రనగర్ కోర్టు

2

## చైనా ఫోన్ చూడటానికే బాగుంటుంది..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చైనా ఫోన్‌తో పోల్చిన కవిత
- సరిగ్గా పని చేయదన్న కవిత
- ఏ కులంలో ఎంత జనాభా ఉందో లెక్కలు బయట పెట్టడం లేదని విమర్శ
- బీసీ సంఘాలు తెలంగాణ పోరాటం తరహా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్,ఫిబ్రవరి10,(నిజం చెపుతాం) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చైనా ఫోన్‌తో పోల్చారు. జగిత్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఐఫోన్‌కు, చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉందో, కేసీఆర్‌కు రేవంత్ రెడ్డికి అంతే తేడా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. చైనా ఫోన్ చూడటానికే బాగుంటుందని, కానీ సరిగ్గా పని చేయదని అన్నారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బురిడీ కొట్టించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ కులంలో ఎంత జనాభా ఉందో లెక్కలు ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాల నేతలతో తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారని, వారితో స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశం కావడం లేదని ప్రశ్నించారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.మరో తెలంగాణ పోరాటం తరహా ఉద్యమానికి బీసీ సంఘాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తప్పుడు జనాభా లెక్కలతో బీసీ సమాజం ఆగ్రహంతో ఉందని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాల నాయకులతో చర్చలు జరపాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీలు 52 శాతం ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని విమర్శించారు. ఈ తప్పుడు లెక్కలను చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని ఆమె ఆరోపించారు.

## రేవంత్ రెడ్డి వారి కోసమే పనిచేస్తున్నారు

ఏడాదిగా కౌరవ పాలన సాగుతోంది



- అనుముల సోదరుల కోసం, అదానీ కోసం పని చేస్తున్నారని విమర్శ
- కొడంగల్ రైతు దీక్షలో కేటీఆర్ విమర్శలు
- రేవంత్ రెడ్డి ప్రజల కోసం పని చేయడం లేదు
- కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోంది
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## 24న ఏపీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ లతో సమావేశం కానున్న చీఫ్ విప్



ఏపీలో కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు సిద్ధమవుతోంది. గత జులైలో చంద్రబాబు సర్కార్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అసెంబ్లీ సమావేశాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలయింది. ఈనెల 24న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. గవర్నర్ ప్రసంగంతో శాసనసభ సమావేశాలు మొదలవుతాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు.

## దాడికి గురైన చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడిని పరామర్శించిన కేటీఆర్

- రంగరాజన్ పై దాడికి పాల్పడిన కొందరు వ్యక్తులు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి రంగరాజన్ ను పరామర్శించిన కేటీఆర్
- దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

హైదరాబాద్,ఫిబ్రవరి10,(నిజం చెపుతాం) చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై కొందరు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రంగరాజన్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ తదితరులతో కలిసి రంగరాజన్ నివాసానికి కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రంగరాజన్ పై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఏ ముసుగులో ఉన్నా, ఏ అజెండాతో ఈ దారుణానికి ఒడిగట్టినా... వారిని ఉక్కుపాదంతో అణచివేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు. భగవంతుడి సేవలో ఉండే రంగరాజన్ కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే... రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్వామివారి సేవలో ఉండే



కుటుంబాన్ని అవమానించడమంటే... దేవుడిని అవమానించినట్టేనని చెప్పారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రంగరాజన్ కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని అన్నారు.

# పోలీస్ కస్టడీకి మస్తాన్‌సాయి

అభ్యంతరకర వీడియోలతో యువతులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్తాన్‌సాయిని పోలీసులు తమ కస్టడీకి తీసుకోనున్నారు. యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడినట్లుగా మస్తాన్‌సాయి ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. మస్తాన్‌సాయిని తమ కస్టడీకి ఇవ్వాలని నార్సింగి పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.మస్తాన్‌సాయి రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ప్రస్తుతం అతను జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. పోలీసులు ఈ నెల 13న మస్తాన్‌సాయిని తమ కస్టడీకి తీసుకోనున్నారు. మస్తాన్‌సాయిపై గతంలో నార్సింగి, మోకిల పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.రాజ్ తరుణ్, తాను విడిపోవడానికి మస్తాన్‌సాయి కారణమని కొన్ని రోజులకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లావణ్య పేర్కొన్నారు. పలువురు అమ్మాయిల ప్రైవేటు వీడియోలు కూడా అతని వద్ద ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పోలీసులు ఇటీవల మస్తాన్‌సాయిని అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో అతని హార్డ్ డిస్క్‌లో వందలాది మంది అమ్మాయిల ప్రైవేటు వీడియోలను పోలీసులు గుర్తించారు.

# అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై దాడి అమానుషం

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ మీద దాడి ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. అర్చకుడిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రంగరాజన్ ఉన్నతస్థాయి పదవులను త్యజించి సనాతన ధర్మ పరిరక్షణకు అంకితభావంతో సేవలు అందిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఉన్నతమైన ధార్మిక విలువలను పాటిస్తున్నారని, అటువంటి గౌరవప్రదమైన అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై జరిగిన ఈ అమానుష దాడి నిందనీయం, బాధాకరం, దురదృష్టకరమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్జన్య చర్యలకు, బెదిరింపులకు, భౌతిక దాడులకు ఏ మాత్రం స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, సనాతన ధర్మంపై జరిగిన దాడిగా భావించాలని ఆయన అన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా యువతకు, విద్యార్థులకు ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తున్న రంగరాజన్ దేవాలయాలను, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే విషయంలో, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడే విషయంలో ముందువరసలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ దాడిని సమాజంలోని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని సోషల్ మీడియా పోస్టులో రాసుకొచ్చారు.సంబంధిత అధికార యంత్రాంగం ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రంగరాజన్‌కు అన్నిరకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# రేవంత్ రెడ్డి వారి కోసమే పనిచేస్తున్నారు: కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం పని చేయడం లేదని... అనుముల అన్నదమ్ముల కోసం, అదానీల కోసం పని చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ రైతు నిరసన దీక్ష సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన సాగుతోందని విమర్శించారు. కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి తన వారికి దోచిపెట్టేందుకు పని చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మంచి చేస్తారని కొడంగల్ ప్రజలు ఆశించారని, కానీ అది జరగలేదన్నారు. రైతుబంధు డబ్బులు ఎవరికైనా వచ్చాయా? అని నిలదీశారు.

# ఘనంగా కుంభం విద్యసాగర్ రెడ్డి జన్మదిన వేడుకలు



వలిగొండ ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం) వలిగొండ రామాలయ చైర్మన్ కుంభం విద్య సాగర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ వంగాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించి కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావి వేణుగోపాల్ రెడ్డి, కొంపల్లి మహేష్ గౌడ్, మారగోని విష్ణు గౌడ్, చరణ్ కుమార్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి..




చౌటుప్పల్, ఫిబ్రవరి10(నిజం చెపుతాం): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. చౌటుప్పల్ సిఐ జి.మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం బ్రిడ్జి కింది నుండి సోమవారం మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో దివిస్ కంపెనీ వైపు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి వయసు సుమారు 35 నుండి 45 సంవత్సరాలు గల వ్యక్తి నడుచుకుంటూ దివిస్ కంపెనీ వైపు వెళుతుండగా మార్గమధ్యలో తొనుకునూరి వెంకటేష్ ఇంటి వద్దకు వచ్చేసరికి మూర్చ వచ్చి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఇతని ఆధారాలు తెలియరాలేదు.ఇతని వద్ద ఎలాంటి ఐడి కార్డ్స్ లేవు.ఇతని యొక్క సమాచారం తెలిసినచో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ 8712662744,8712662481 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కనకటి యాదగిరి తెలిపారు.

# వరుస ఎన్కౌంటర్లతో...అన్నలు ఆగమాగం

మొదటిపేజీ తరువాయి..

- మావోయిస్టులపై ముప్పేట దాడులు
- అగ్రనేతల వేటలో బలగాలు
- దిక్కుతోచని స్థితిలో మావోయిస్టులు
- అమిత్ షా శపథం నెరవేరనుందా?





ఫిబ్రవరి 10, (నిజం న్యూస్) ఉమ్మడి ఖమ్మం బ్యూరో : వరుస ఎన్కౌంటర్లతో అడవిలో అన్నలు ఆగమాగం అవుతున్నారు.ఆపరేషన్ కగార్ పేరుతో గత ఏడాది నుండి భద్రతా బలగాలు ముప్పేట దాడులతో మావోయిస్టులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. గడచిన సంవత్సరం ఎన్కౌంటర్లలో 217 మంది మృతి చెందగా 2025వ సంవత్సరం రెండవ నెలకూడా పూర్తి కాకుండానే ఇప్పటివరకు జరిగిన పది ఎన్కౌంటర్లలో 89 మంది మృతి చెందారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా శపథాన్ని నెరవేర్చే దిశగా భద్రతా బలగాలు కాకులు దూరని కారడవిలోకి సైతం చొచ్చుకు పోతూ మావోయిస్టులను మట్టుపెడుతున్నాయి.ఇన్నాళ్ళూ దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వం నడిపిన మావోయిస్టు పార్టీకి ప్రస్తుతం అక్కడ నిలువనీడ లేని పరిస్థితికి వచ్చింది.అగ్రనేతలే టార్గెట్ గా జరుగుతున్న కూంబింగ్ ఆపరేషన్లకు చిక్కి లీడర్లతోపాటుగా కేడర్ కూడా మృత్యువాత పడుతున్నారు. తాజాగా ఛత్తీస్ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ ఎన్కౌంటర్లో 31మంది మృతి చెందగా అందులో 11మంది మహిళలు ఉన్నారు. మృతులను గుర్తించే ప్రక్రియ జరుగుతుందని పోలీస్ వర్గాలు తెలిపాయి.

### మావోయిస్టులు బలగాలకు ఎలా చిక్కుతున్నారు?

కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రహదారులు నిర్మిస్తూ నూతనంగా పోలీసు క్యాంపులను ఏర్పాటు చేస్తుంది. క్యాంపులలోని బలగాలు నిరంతర కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టడం వల్ల మావోయిస్టు కార్యకలాపాలకు చెక్ పడినట్టు అయ్యింది. దీనికి తోడు గతంలో వారి వల్ల నష్టపోయిన కుటుంబాలకు చెందిన యువత పోలీస్ ఉద్యోగాలలో చేరడం, దండకారణ్యంలోని అడవులలో ప్రతి తెలిసిన మావోయిస్టులు కొందరు దళాన్ని వీడి భద్రతా బలగాలలో చేరడం వల్ల వారి సహాయంతో పోలీసులు రహస్య స్థావరాలను సైతం కనుగొంటున్నారు. ఈ మధ్యకాలంలో బీజాపూర్, సుకుమా జిల్లాల్లో మావోయిస్టులు ఆయుధాలు తయారు చేసే స్థావరాలపై కూడా దాడులు చేసి అక్కడ ఉన్న పలు యంత్రాలను ధ్వంసం చేశారు. నూతన రిక్రూట్మెంట్ లేక, ఎన్కౌంటర్లు జరిగిన ప్రతిసారి భారీ స్థాయిలో ఆయుధాలు కోల్పోతుండడంతో మావోయిస్టులు దిక్కు తోచని పరిస్థితుల్లో బలగాలకు చిక్కుతున్నారు.

### అమిత్ షా శపథం.. నెరవేరేరుతుందా?

2026మర్చి నాటికి నక్సల్స్ రహిత ఛత్తీస్ఘడ్ ను నెలకొల్పు తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన నెరవేరుతుందా అనే ప్రశ్నకు ప్రస్తుతం జరుగుతున్న ఎన్కౌంటర్లను చూస్తే అవుననే సమాధానం వస్తుంది. కానీ సమాజంలో అణచివేత, పీడన ఉన్నంతవరకు మావోయిస్టు పార్టీ అంతం అయ్యే ప్రసక్తి లేదని పౌర హక్కుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

# కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో రేకుల షెడ్ నిర్మాణం

- కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి
- మోటకొండూరు విద్యాధికారి రఘు రాంరెడ్డి చేయుత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రామ్ రెడ్డి

మోటకొండూరు: ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం)పెందలకడనే లేచి చదివితే చదువులో వెనుక బడిన వారు మొద్దులు కూడా బుద్ధులా తయారు అవుతారని ప్రముఖ కవి,గాయకుడు చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి అన్నారు.ఆయన సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో 20వేల రూపాయల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంటశాల కోరకు నిర్మించిన రేకుల షెడ్ ను చంద్రకళ,వెంకట్ రాంరెడ్డి,ప్రధానోపాధ్యాయులు కె.రఘురాం రెడ్డి లతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు మంచి పట్టుదలతో చదివి ర్యాంకులు సాదించాలని,మంచి ర్యాంకులు సాదించిన వారికి చేయూత,కంది పౌండేషన్ ల ఆధ్వర్యంలో తగిన పారితోషికం అందించనున్నట్లు తెలిపారు.ప్రధానోపాధ్యాయులు కె.రఘురాం రెడ్డి మాట్లాడుతూ...కంది శశిధర్ రెడ్డి పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రేకుల షెడ్ విద్యార్థులకు బాగా ఉపయోగపడుతుందని, గత రెండు సంవత్సరాల నుంచి ఈ షెడ్డు నిర్మాణానికి చూస్తున్నామని ఎండకు వానకు కోతుల బెరదతోటి చాలా ఇబ్బందులు పడ్డామని నిర్మాణానికి సహకరించిన కంది పౌండేషన్ ఇంతింతై వటుడింతై అన్నట్లు బాగా అభివృద్ధి చెంది మండలంలోనే కాకుండా జిల్లా,రాష్ట్ర స్థాయిలో చదివే పేద విద్యార్థులకు బాసటగా నిలువాలని కోరారు.ఈ కార్యక్రమంలో కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కంది అనిల్ కుమార్ రెడ్డి డైరెక్టర్ ఏనుగు నాగిరెడ్డి శ్వేతా రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ...

ఆలేరు ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం) ఈ ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన పవిత్రమైన వృత్తి ఇంకొకటి లేదని శ్రీ రామకృష్ణ విద్యాలయ ప్రధానాచార్య బండిరాజుల శంకర్ అన్నారు.సోమవారం రోజున పాఠశాలలో 'స్వపరిపాలన దినోత్సవం' ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత ఆ పిల్లల క్షేమాన్ని,ఉజ్వల భవిష్యత్తును కోరుకునేది విద్యాబుద్ధులను నేర్పే గురువు మాత్రమే.అందుకే గురువుకు అంతటి ఉత్కృష్టమైన స్థానాన్ని ఇవ్వడం జరిగిందని అన్నారు.ఈ ఉత్సవంలో వివిధ పదవులు చేపట్టిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా చరణ్ నాయక్,ఎం.పిగా అన్వార్,ఎం.ఎల్.ఏగా అఖిల్ యాదవ్, డిఇఓగా ఓ.అక్షయ, డిప్యూటి ఈఓగా సాత్విక్, ఎంఇఓగా భవాని,ప్రిన్సిపాల్ గా లోకేశ్, వైస్ ప్రిన్సిపాల్ గా మహేశ్వరి,కలెక్టర్ గా రాంచరణ్,డాక్టర్లుగా వర్షిత,శాలిని,ఉపాధ్యాయులుగా సాయిప్రసన్న,బి.అక్షయ,ప్రణీత్ కుమార్,జి.అక్షయ,ఐశ్వర్య చౌదరి,నవ్య తదితరులు తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తరిగొప్పుల రమేశ్,ఆచార్యులు జూకంటి సిద్ధులు,నారగోని భీమేశ్,బొడ్డు రమేశ్,గుగ్గిళ్ళ జయమ్మ,మాడిశెట్టి వాణిశ్రీ,కడారి పరమేశ్వరి,కాయితి అన్నపూర్ణ,అంబాల ప్రసన్నలక్ష్మి,అప్పాల స్వరూప,మైలబోయిన పావని,ఆత్మకూరి దీపిక,యెనగందుల కవిత,యానాల సరస్వతి,వంగపల్లి శ్వేత,పిడిశెట్టి భవాని,ఎం.కృష్ణమూర్తి,వేముల భవాని,హేమలత,మౌనిక పాల్గొన్నారు.




# చౌటుప్పల్ లో డ్రైనేజ్ లోకి దూసుకెళ్లిన కారు



చౌటుప్పల్, ఫిబ్రవరి10(నిజం చెబుతాం): డ్రైనేజీలోకి కారు దూసుకెళ్లిన సంఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. వ్యవసాయ మార్కెట్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో కారు నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలోకి దూసుకెళ్లింది.దీంతో సర్వీస్ రోడ్ లో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.చౌటుప్పల్ మున్సిపాలిటీలో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు,వాహనదారులు ఆరోపిస్తూన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరియు అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

# పలువురుని పరామర్శించిన దైద రవీందర్



జనవరి 10 నకిరేకల్ ( నిజం చెప్తాం )చెరుకుపల్లి జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో ప్రభుత్వ అటెండర్ అయిన యతకుల వెంకయ్య గారు మృతి చెందగా వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదర్చనారు మరియు చీమల గడ్డ ఐదో వార్డులో గద్దపాటి అంజమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేశారు ఈ కార్యక్రమంలో దైద రవీందర్ తో పాటు తిగల వెంకన్న శంకర్ నాగరాజు సిహెచ్ సైదులు సిహెచ్ రాజశేఖర్ గిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు

# మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల గెలుపు ఖాయం

- మన్నే మోహన్ రెడ్డి తనయుడు శ్రీనివాస్ రెడ్డి



సంస్థాన్ నారాయణపురం,ఫిబ్రవరి10,(నిజం చెపుతాం):సంస్థాన్ నారాయణపురం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ డంకా ముగించడం ఖాయం మన్నె శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలుస్తూ అనేక వ్యైనటువంటి అభివృద్ధి పథకాలను చేపడుతూ పరిపాలన చేస్తున్నది.మునుగోడు నియోజకవర్గం లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు నడుస్తున్నది వారి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల లో కాంగ్రెస్ పార్టీ విజయ డంక మోగించడం ఖాయమని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజలలోకి తీసుకువెళ్లి మరింత బలం చేకూర్చాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# కరువు ప్రాంతాలకు సాగునీరు తేవడమే ధ్యేయం



**- శ్రీ శ్రీ ఆంధోల్ మైసమ్మ జలసాధన సమితి**

చౌటుప్పల్,ఫిబ్రవరి 10(నిజం చెపుతాం) చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లగిరి, కైతాపురం,ఎల్లంబావి, ఆంతమ్మ గూడెం, కొయ్యలగూడెం,మల్కాపురం,తుప్రాన్ పేట గ్రామాల రైతులు,రైతు కూలీలు వ్యవసాయం పైన ఆధారపడేవారు. సబ్బండ వర్గాల ప్రజల కరువులో ఉన్న ప్రాంతానికి సాగు నీరు తేవడమే ధ్యేయంగా సోమవారం ఉదయం 10:00 గంటలకు ఎల్లగిరి ఎక్స్ రోడ్డులోని రిక్కల నిర్మలనర్సిరెడ్డి ఫంక్షన్ హాల్ లో మెట్టు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జల సాధన సమితి కన్వీనర్ కట్టా భగవంత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతములోని చెరువులు,కుంటల్లో నీరు లేక ఈ ప్రాంతం అంతయు ఎడారిగా మారిపోవుచున్నది. ఇదేవిధంగా ఉంటే మునుముందు త్రాగడానికి నీరు దొరకక మనుషులకే కాకుండా పశు,పక్షులకు ప్రమాదం ఏర్పడే అవకాశం కలదు. ఉన్న కాస్త సాగు చేసిన వరి పంట ఎండలకు బోర్లు ఎండిపోయినాయని రైతులు బోరున విలపిస్తూ న్నారన్నారు. శాంతి యుతంగా ప్రభుత్వాన్ని ఒప్పించి సాగు నీళ్ళు సాధించాలని ఏక తాటి పైకి వచ్చారు. సమావేశం లో వివిధ గ్రామాల మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు మరియు సుమారు 200 మంది రైతులు వ్యవసాయం పై ఆధార పడిన రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ బాల స్వస్థత, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ పై సమీక్ష


**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ,డాక్టర్, జి మురళీధర్.**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి. 10, (నిజం న్యూస్)జిల్లా కలెక్టరేట్లోని ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ అధ్యక్షతన రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ పై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్ బి ఎస్ కే రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం జిల్లాలోని స్కూల్స్ అంగన్వాడి సెంటర్లలో పిల్లలందరినీ స్క్రీనింగ్ చేసి జిల్లాలో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కి పంపించి వారికి చికిత్స అందించాలని, అదేవిధంగా డైక్ సెంటర్లో ఫిజియోథెరపిస్ట్ దంత వైద్య నిపుణులు , సైక్రియాట్రిస్ట్, సోషల్ వర్కర్, వినికిడి సంబంధించిన నిపుణులు, పిల్లలందరికీ వైద్య సేవలు అందించాలని, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిఫరల్ అయిన కేసులు అన్నింటిని విధిగా సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సారంగం, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కే వి రాజు, గీత, శారద ఆర్బిఎస్కే సిబ్బంది, డి ఈ ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# దామరవంచ ప్రిన్సిపాల్ పై చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

**- పేరెంట్స్ కమిటీ చైర్మన్ అజ్మీరా బాలు నాయక్.**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10, (నిజం న్యూస్) దామరవంచ గురుకులంలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో పేరెంట్స్ కమిటీ మెంబెర్స్, చైర్మన్ లు గురుకుల పాఠశాలకు వెళ్లి సందర్శించి విచారణ చేయగా అందులో దామరవంచ ప్రిన్సిపాల్ ది ఎలాంటి తప్పు లేదని రుజువైంది. కానీ కొంతమంది కావాలని దామరవెంచ గురుకులం ప్రిన్సిపాల్ అయిన హేమ నాయక్ పై దుష్ప్రచారం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ,పిల్లల కోసం నిరంతరం అహర్నిశలు కృషి చేసే హేమానాయక్ పై తప్పుడు ప్రచారాలు చేస్తే పేరెంట్స్ కమిటీగా చూస్తూఊరుకోమని హెచ్చరించారు. %శ్రీ%హేమ సార్ వచ్చినప్పటినుండి గురుకుల పాఠశాల చాలావరకు క్రమశిక్షణగా ఉందని పిల్లలను చాలా చక్కగా చూస్తున్నారని తెలిపారు. కావాలని లోపటి సిబ్బంది, బయటి వ్యక్తులు ప్రిన్సిపాల్ పై అసత్య ప్రచారాలు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పేరెంట్స్ కమిటీ హెచ్చరిస్తుంది. పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని, పిల్లల జీవితాలతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు సురేందర్, వెంకన్న, పాయం నరసింహ, రాజు, ఉపేందర్ ,రమేష్ లు వున్నారు.

# కిసాన్ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమానికి బియ్యం పంపిణీ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10,( నిజం న్యూస్).శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు సందర్భంగా బొట్టు మీద తండా, శ్రీ రాజ్య తండా, వావిలాల పరిధిలో వీరన్న కి బియ్యం అందించడం జరిగింది. కిసాన్ పరివార్ సంస్థ అధినేత భూపాల్ నాయక్ అదేవిధంగా సీఈవో డాక్టర్ వివేక్ ఆదేశాలు మేరకు బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఈ పంపిణీ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సంఘం ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్, కిసాన్ పరివార్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ హరిబాబు, కిసాన్ పరివార్ సీరియల్ మండల కోఆర్డినేటర్ విష్ణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూమిలో దహన సంస్కారాలా?...

**- భవాని నగర్ తండా కు ఆనుకుని ఉన్న పట్టా భూమి సర్వేనెంబర్ 669 ముస్లింలకు చెందిన స్థలం.**

**- ఈ సర్వే నెంబర్ భూమి నిజాం చెరువు పక్కనే ఉంటుంది.**

**- చనిపోయిన వారిని అక్కడ దహనం చేయడం వల్ల దుర్వాసన, పోగవల్ల అనారోగ్యానికి గురి అవుతున్న కుటుంబాలు.**

**- ఇక్కడ దహన కార్యక్రమాలు నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞాపన ఇవ్వడం జరిగింది.**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10,( నిజం న్యూస్). మహబూబాబాద్ పట్టణంలోని ఈద్గా బజార్, భవాని నగర్ తండాకు చెందిన ఇండ్లవాసులు ఈరోజు మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈద్గా బజార్ భవాని నగర్ తండా కు ఆనుకుని ఉన్న పట్టా భూమి సర్వే నంబర్ 669 ముస్లింలకు చెందిన స్థలం. ఈ స్థలం నిజాం చెరువు పక్కనే ఉండటంతోఈ స్థలంలో కొంతకాలంగా మహబూబాద్ కు చెందిన కొందరు చనిపోయిన వారిని అక్కడ దహనం చేస్తున్నారు. దహనం చేసే సమయంలో వస్తున్న దుర్వాసన, పొగ వల్ల మా కుటుంబాలు ఇబ్బందులు పడుతూ, అనారోగ్యానికి గురవుతున్నారని, ఇట్టి దహన కార్యాక్రమాలను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ ని కోరడం జరిగింది. కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అందుబాటులేకుంటే,మునిసిపల్ మేనేజర్ కి వినతిపత్రం అంద చేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో కొత్తగా స్మశానవాటికలునిర్మాణంజరిగాయి. ఇప్పుడుమహబూబాబాద్లోద –దాపు5,6"స్మశానవాటికలు" ఉన్నప్పటికీ, కొందరు ఇక్కడే శవదహనాలు చేస్తూ,మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నార వారు తెలిపారు. ఈ భూమి పక్కన పట్టా భూముల్లో కొందరు పేద, మధ్యతరగతి వారు ఇళ్ల జాగాలు కొని ఉన్నారు. ఈ స్మశానం వలన వాళ్ళు ఇల్లు కట్టుకోలేక నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై తమరు జోక్యం చేసుకొని అక్కడ శవదహనాలు జరగకుండా చర్యలు తీసుకొని, దానివల్లఇబ్బంది పడుతున్న మమ్మల్ని అనారోగ్యాలనుండి రక్షించాలని పిల్లవాసులు కమిషన్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ ఖాన్, నజీర్,గులాం మక్బూల్ , ఫిరోజ్ ఖాన్, అజీమ్, అజీజ్, బాబూలాల్, ఆమెనా, హుసేన్ బీ, రఫియా,రహిమ, సఫియా, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

# తాపీ మేస్త్రి సంఘం తొర్రూర్ డివిజన్ అధ్యక్షునిగా సోమహరిప్రసాద్



తొర్రూరు ఫిబ్రవరి 10 (నిజం చెప్పుతాం) సగర తాపీ మేస్త్రి కార్మిక సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షునిగా సోమ హరిప్రసాద్ ఎన్నికయ్యారు. డివిజన్ కేంద్రంలోని 14 వ వార్డులో ఉన్న సంఘ కార్యాలయంలో సోమవారం సగర తాపీ మేస్త్రి సంఘం డివిజన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఈ అధ్యక్ష పదవికి మార్క సాంబయ్య, సోమ హరిప్రసాద్ లు పోటీ చేయగా సాంబయ్య పై హరిప్రసాద్ గెలుపొందారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీల సంఘం సభ్యులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. నూతన అధ్యక్షుడు సోమ హరిప్రసాద్ మాట్లాడుతూ తాపీ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షునిగా ఎన్నుకున్న తాపీ మేస్త్రీల సభ్యులకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు హరిప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ పూలమాలవేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు సోమ సత్యం, సోమ సాంబయ్య, వేముల వెంకన్న,దుంపల సమ్మయ్య,గుంజి నరసింహులు, మేస్త్రి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం

**- మరిపెడ తహశీల్దార్ సైదులు**



డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జి మరిపెడ ఫిబ్రవరి 10 నిజం న్యూస్ ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించడం అభినందనీయం అని మరిపెడ మండల తహశీల్దార్ సైదులు అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక ఆడిటోరియంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మరిపెడ తహశీల్దార్ సైదులు, అతిథులుగా మెడికల్ ఆఫీసర్ గూగులోత్ రవి, ప్రగతి సేవాసమితి వ్యవస్థాపకులు గద్దల జాన్ లు పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంప్ ను ప్రారంభించారు. ఈసందర్భగా వారు మాట్లాడుతు ప్రగతి సేవాసమితి ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత ముప్పై ఏండ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్థిక అక్షరాస్యత కోసం పనిచేస్తుందని తెలిపారు. ప్రగతి సేవాసమితి వ్యవస్థాపకులు గద్దల జాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రగతి సేవాసమితి ఆర్థిక అక్షరాస్యత తోపాటు విద్య, వైద్యం, వృత్తి నైపుణ్య శిక్షణతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిభిరంలొ 68 మందికి పరీక్షలు చేయగా 34మంది ని శంకర కంటి ఆసుపత్రి హైద్రాబాద్ కు ఆపరేషన్ కోసం పంపామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రగతి సేవా సమితి తొర్రూరు క్లస్టర్ కో ఆర్డినేటర్ ఐనాల పరశు రాములు, శంకర కంటి ఆసుపత్రి క్యాంప్ కో ఆర్డినేటర్ శివగంగ, ప్రగతి సేవాసమితి మండల కో ఆర్డినేటర్ జినక సువార్త,ఏరియా కో ఆర్డినేటర్ బాషిపంగు వీరబాబు,తాళ్ళఊకల్ కో ఆర్డినేటర్ తప్పెట్ల సతీష్,మరిపెడ కో ఆర్డినేటర్ వెంకటరమణ,గాలివారీగూడెం కో ఆర్డినేటర్ ఈదుల మహేశ్వరీ, అబ్బాయిపాలెం కో ఆర్డినేటర్ జినక క్రిష్ణమూర్తి,యల్లంపేట కో ఆర్డినేటర్ నలబోతు విజయ, గుండంరాజుపల్లి కో ఆర్డినేటర్ బర్పటి సంధ్య, శంకర కంటి ఆసుపత్రి సిబ్బది అర్చన,సోనమ్, ఫ్రాన్స్, దివ్య, రిషాద్,పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గం...



తొర్రూరు ఫిబ్రవరి 10 (నిజం చెప్పుతాం) ఆధ్యాత్మిక చింతనతో సమాజం సన్మార్గంలో నడుస్తుందనిజగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానంద స్వామి తెలిపారు. మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో నెలకొల్పిన జగద్గురు గీత ఆశ్రమ 20వ వార్షికోత్సవంలో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. గీతా ఆశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానంద స్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వార్షికోత్సవంలో భాగంగాచీరాలకు చెందిన ప్రణవానంద స్వామి, కోరుట్లకు చెందిన జగదీశ్వర్ ఆనందగిరి స్వామి, సూర్య ప్రకాశానంద స్వామి, ప్రశాంత నందగిరి స్వామి లు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానచైతన్యానంద స్వామి మాట్లాడుతూ..నిత్య భగవన్నామ స్మరణతో మనిషికి ఆరోగ్యం, ఆనందం, జీవిత పరమార్థం దొరుకుతుందని తెలిపారు. ధైనందిన జీవితంలో ఆధ్యాత్మిక చింతన ఒక భాగమని, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ నిజాయితీగా జీవించడానికి అలవాటును నేర్పిస్తుందన్నారు. ప్రతీ వ్యక్తి భ క్తిభావాన్ని అలవరుచుకోవాలన్నారుఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు గురిజాల సోమిరెడ్డి, ప్రతి కంఠం వెంకటేశ్వర రాజు, బోయిన రవీందర్,చిత్తలూరి సతీష్, పబ్బోజు వెంకటాచారి, వెంకటేశ్వర్లు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ అభిమాన సంఘం అడహక్ కమిటీ ఎన్నిక

**- తొర్రూరులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కృషి**



తొర్రూరు ఫిబ్రవరి 10 (నిజం చెప్పుతాం)విశ్వ విఖ్యాత నట సార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు అభిమాన సంఘం అడహక్ కమిటీని సోమవారం డివిజన్ కేంద్రంలోని కంటయపాలెం రోడ్డులో ఉన్న పాటిమీది గుడి ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అడహక్ కమిటీ కన్వీనర్ గా పేర్ల జంపన్న, కో-కన్వీనర్లుగా ధరావతు భీమానాయక్,సముద్రాల సోమన్న, ఎండీ మాలిక్,రామగిరి మురలీధర్, మంగళ పెల్లి ఆశయ్య, వీ.రమేష్,పల్లె ఏకాంతం,కొయ్యడ సాంబశివ గౌడ్, గౌరవ సలహాదారులుగా దొనికెన కుమారస్వామి,పోతురాజు యాకేందర్,తుర్పాటి చిన్న అంజయ్య,ఎన్నమనేని శ్రీనివాస్ రావు,అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి,పేర్ల ఉప్పలయ్య,భాస్కర్,కమిటీ సభ్యులుగా మోటం శీను, నర్కుటి పుల్లయ్య,పస్తం ఉప్పలయ్య,పేర్ల సమ్మయ్య,గాదేగాని వెంకన్న, మానగాని అరుణ్ కుమార్, పత్తి శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ పేర్ల జంపన్న మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహోన్నత,పేద ప్రజల కోసం అహర్నిశలు పాటుపడి తెలుగు జాతిని గర్వించే విధంగా కృషిచేసిన మహానీయుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం కోసం అడహక్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. రాజకీయ పార్టీలు,కులాల, మతాలకు అతీతంగా పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## సెల్ ఫోన్ లను రికవరి చేసిన భూపాలపల్లి పోలీసులు




భూపాలపల్లి (నిజం చెపుతాం) ఫిబ్రవరి 10: సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో భూపాలపల్లి పోలీసులు పోగొట్టుకున్న సెల్ ఫోను లను తక్కువ సమయంలో బాధితులకు అప్పగించారు. వివిధ సమయాల్లో బాధితుల సెల్ ఫోన్ లు మిస్సవ్వగా, అట్టి వివరాలు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ నెంబర్ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ . సిఈఐఆర్.జివోవి.ఇన్ వెబ్సైటులో వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపరిచి 13 మంది ఫోన్లు రికవరీ చేసి వారికి అందించడం జరిగిందిఈ సందర్భంగా భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు మరియు భూపాలపల్లీ సిఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ సెల్ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ కు సంబధిత వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ .సిఈఐఆర్.జివోవి.ఇన్ వెబ్సైటులో వెళ్లి అందులో పూర్తిగా వివరాలు నమోదు చేసిన తరువాత వారి సెల్ఫోన్ ను పట్టుకోవడం జరుగుతుందని, ఈ సాంకేతికతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అర్హులైన పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**- హౌసింగ్ లోన్లు 5 లక్షలకు పెంచి మంజూరు చేయాలి.**

**- మోసపూరిత వాగ్దానాలు ఇక నమ్మం - ఇళ్ల స్థలాల అమలకే సిపిఐ ధర్నా.**

కాకినాడ,ఫిబ్రవరి10(నిజం ప్రతినిధి): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడలో 47 వ వార్డులో గ్రామ వార్డు సచివాలయం వద్ద సోమవారం ఉదయం సిపిఐ నగర కార్యదర్శి టి. అన్నవరం ఆధ్వర్యంలో అర్హులైన పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిరసన ధర్నా జరిగింది. ఈ నిరసన ధర్నాకు ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ముందుగా ఎస్ .అచ్యుతాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి, బుద్ధ విహార్ మీదుగా, ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్ నుండి సచివాలయానికి ప్రదర్శన ర్యాలీ జరిగింది. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్లు, రూరల్ ప్రాంతంలో మూడు సెంట్లు భూమిని ఇవ్వాలని, హౌసింగ్ లోన్లు ఐదులో ఐదు లక్షల ఇవ్వాలని నినాదాలు చేయడం జరిగింది. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారని, మరోపక్క అద్దెల విపరీతంగా పెరగడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, కూలీ పనులు చేస్తున్న వారికి ఇంటి




అద్దెల భారం మోయలేకున్నారని, గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి పట్టా, రిజిస్ట్రేషన్, అర్బన్ ప్రాంతాల్లో 1 సెంట్లు భూమి, పట్టా రిజిస్ట్రేషన్ చేయించారని కానీ స్థలం ఎక్కడుందో చూపించలేని, అందని ద్రాక్షావలె పేదోళ్ల సొంతింటి కల కలగా మిగిలే పరిస్థితి దాపరించిందని, ఇకనైనా ప్రభుత్వాలు పేద ప్రజలతో చెలగాటమాడడం మానుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమిని, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని ఆ హామీలను తక్షణమే అమలుచేసి 5 లక్షల రూపాయలు హౌసింగ్ లోన్లు మంజూరు చేయాలని ఆయన అన్నారు.



తెలుగు సంవత్సరాది ఉగాది లోపు నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు ఇక నమ్మేది లేదని సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ప్రసాద్ అన్నారు. ఈ నిరసన ధర్నా అనంతరం సచివాలయ సెక్రటరీల అడ్మిన్ లకు వినతి పత్రం, ఇళ్ల స్థలాల అప్లికేషన్లు అందజేయడంతో అడ్మిన్లు నిరాకరించడంతో సచివాలయంను ముట్టడించి అనంతరం అప్లికేషన్ తీసుకున్నారని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బి. చిన్న, నాని బాబు, శ్రీను, అప్పలకొండ, సుశీల రాణి, ప్రవల్లిక, లక్ష్మి, గంగాలమ్మ, అరుణ, సావిత్రమ్మ, దేవి, బేబీ తదితర 47 వ.వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

**- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే**



భూపాలపల్లి (నిజం చెపుతాం) ఫిబ్రవరి 10: ప్రజల ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టొద్దని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ సమస్యలపై వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులకు చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి గారు అధికారులు ఆదేశించారు.


## ఆహారకరమైన ఉద్యానవనంగా బోటు క్లబ్బు పార్క్- ఎమ్మెల్యే నానాజీ...

కాకినాడ జిల్లా కాకినాడ సిటీ నిజం బ్యూరో( రామరాజు) ఫిబ్రవరి 10 :- పార్కు సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకుగాను బోటు క్లబ్ ఉద్యానవనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్లు కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక గుడారిగుంటలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో బోటు క్లబ్ ఉద్యానవనం లో నగర వనాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరుతూ వాకర్స్ సంఘ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో అతిపెద్దదైన ఉద్యానవనం బోటు క్లబ్ పార్క్ అని దీనిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నగర, పట్టణాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరవనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తలపెట్టారని అన్నారు. పర్యావరణ పరిరక్షణ తోబాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే ఈ నగర వనాల లక్ష్యం అని అన్నారు. పార్కులో ఉన్న చెరువు మధ్యలో ఐలాండ్ మీద బుద్ధుని విగ్రహం పెట్టడానికి గతంలో ప్రయత్నం జరిగిందని కానీ సాధ్యం కాలేదని అన్నారు .రానున్న బుద్ధ పౌర్ణమిని దృష్టిలో పెట్టుకుని బుద్ధుని విగ్రహం వద్ద లైట్లు వేయడానికి అధికారులతో సంప్రదిస్తానని నానాజీ తెలిపారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, గల్లా సుబ్బారావు, రాజా, గోపి తదితరులు



ఎమ్మెల్యేలు కలిసిన వారిలో ఉన్నారు

## ఆలయ అర్చకులపై దాడులు అరికట్టాలి.. దేవతా విగ్రహాలను పరిరక్షించాలి..భోగిగణపతిపీఠం



కాకినాడ జిల్లా కాకినాడ సిటీ నిజం బ్యూరో( రామరాజు) ఫిబ్రవరి 10 :-చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పై బిక్కవోలు కు చెందిన వీరరాఘవరెడ్డి బృందం సాగించిన సామూహిక దాడి అత్యంత దురదృష్టకరమని కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠం ఒక ప్రకటనలో పేర్కొంది. జరిగిన ఘటన ఉద్దేశ్య పూర్వకంగా వర్గ ఆధిపత్య ధోరణి కోసం నెరపినట్టుందన్నారు. మతోన్మాదం.. మతాల్లో వర్గఉన్మాదం.. ఆధ్యాత్మిక ప్రగతికి సమాజ హితానికి మేలు చేయవన్నారు. వేదాలు వేదాంగాలు పురాణాలు ఇతిహాసా లు గ్రంధాలు సంస్కృత వాక్కులు ఖురాన్ బైబిల్ బౌద్ధ సాహిత్యం వల్లె వేసినంత మాత్రాన సమాజహితులు కాలేరని సహనం సంయమనం శాంతి సామరస్యం ధర్మ నిరతి అలవర్చితేనే సమాజానికి మేలు చేయగలుగుతారన్నారు. మతం ఏదైనా ఉగ్రవాదం మంచిది కాదన్నారు. దాడుల సంస్కృతి తగదన్నారు. అర్చకుల రక్షణతో బాటుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు బహిరంగ ప్రదేశాల్లో దేవుని విగ్రహాలను నెలకొల్పి గాలికి వదిలివేసిన వాటిని గుర్తించి తగిన పరిరక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు ప్రధానంగా వహించాలని పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు కోరారు. లేకుంటే అసాంఘిక వాతావరణంలో ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం వుందన్నారు.

## రౌడీల బారి నుండి రక్షించాలని జేసీకి దంపతుల వేడుకోలు..

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నిజం బ్యూరో( రామరాజు) ఫిబ్రవరి 10:- తాము ఉంటున్న ఇంటికి రౌడీలు వచ్చి చంపేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్న వారి నుండి రక్షణ కల్పించాలని కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామానికి చెందిన చెల్లుబోయిన వీరబాబు అతని భార్య అశ్వనిలు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు తన కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరబాబు అశ్వని దంపతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతూ తాము ఏడేళ్ల నుంచి ఇంద్రపాలెం గ్రామంలో ఒక ఇంట్లో అద్దెకుంటున్నామని దాని యజమాని నల్ల సతీష్ కుమార్ ఆ ఇంటిని విక్రయిస్తున్నాడని తెలియజేయడంతో తామే కొనుగోలు చేస్తామంటూ సుమారు ఆరు నెలల క్రితం 15 లక్షల రూపాయలు నగదు ఇచ్చి ఒప్పంద పత్రం రాయించుకున్నామన్నారు. ఇదిలా ఉంటే సతీష్ కుమార్ కాకినాడ రూరల్ మండలంలోని స్వామి నగర్ గ్రామానికి చెందిన బలివాడ కిరణ్ మహేష్ అతని భార్య కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ జగ్గుమహంతి ఉమాలకు తమకు తెలియకుండా ఇల్లు విక్రయించారన్నారు. ఉమా తాము ఉంటున్న ఇంటిని చూసుకుంటుండగా ఆమెకు ఇంటి కొనుగోలు నిమిత్తం సతీష్ కుమార్కు 15 లక్షలు ఇచ్చి ఒప్పంద పత్రం రాయించుకున్నామని చెప్పామని తెలిపారు. అయినా తాము కొనుగోలు చేశామని ఉమా రౌడీలను తీసుకువచ్చి ఇల్లు ఖాళీ చేయాలంటూ బెదిరింపులకు దిగడంతో కాకినాడ కోర్టులో కేసు వేశామని వీరబాబు అశ్వినిలు తెలిపారు. అప్పటినుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సా విధులు నిర్వహించే ఉమా దంపతులు పలువురు రౌడీలను ఇంటి మీదకు పంపించి బెదిరింపులకు దిగేవారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు వివాదాల్లో ఉన్న భూములు కొనుగోలు చేయకూడదని, కోర్టు పరిధిలో ఉన్న వాటి జోలికి పోకుండా ఉండాలని, గొడవలు సృష్టించకూడదంటూ నిబంధనలు ఉన్నా తమ కుటుంబాన్ని ఉమా దంపతులు బెదిరింపులకు గురి చేస్తున్నారంటూ వీరబాబు అశ్వని దంపతులు జేసీని వేడుకున్నారు. తక్షణమే ఉమా పంపిన రౌడీల నుంచి రక్షణ కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి వివాదాలు దిగుతూ



భయభ్రాంతులకు గురిచేస్తున్న బలివాడ కిరణ్ మహేష్ అతని భార్య ఆసుపత్రి స్టాఫ్ నర్స్ ఉమాలపై చర్యలు తీసుకోవాలని వీరబాబు అశ్వని దంపతులు వేడుకున్నారు.

## రక్తదాతలను ప్రోత్సహిద్దాం.. మరొకరి ప్రాణాలు కాపాడుదాం

**- కేసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి పిలుపు....**

కాకినాడ జిల్లా కాకినాడ సిటీ నిజం బ్యూరో ( రామరాజు) ఫిబ్రవరి 10:- రక్తదాతలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ది. కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కేసిబిఎస్)అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. కేసిబిఎస్ మాజీ అధ్యక్షులు దివంగత కోసూరి యదుసూర్య జయంతి సందర్భంగా స్థానిక సూర్యారావుపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత కే సి బి ఎస్ వ్యవస్థాపకులు కోసూరి కృష్ణారావు, కోసూరి ఎదుసూర్య విగ్రహాలకు పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటైన ఈ రక్తదాన శిబిరంలో సంస్థ ఉద్యోగులు, సభ్యులు, ఖాతాదారులు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఒకరు చేసే రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న మరొకరికి ప్రాణదానం వంటిదన్నారు. కేసిబిఎస్ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంస్థ రోజువారీ కార్యకలాపాలతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందన్నారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కే సి బి




ఎస్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.మేనేజర్ చీమలకొండ గంగాధరం రక్తదాన శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. రక్తదానం చేసిన వారందరినీ సంస్థ పాలకవర్గ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కేసిబిఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సర్వర్ పనిచెయ్యక రోగుల ఇక్కట్లు

కాకినాడ జిల్లా సామర్లకోట నిజం బ్యూరో ( రామరాజు) ఫిబ్రవరి 10 :-సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సర్వర్ల పని చేయక ఓపి టికెట్లు నమోదు కాని పరిస్థితి ఏర్పడింది. సోమవారం అనగానే ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య వందల సంఖ్యలో ఉండడం సహజం అయితే ఓపి కౌంటర్ వద్ద సర్వర్లో పనిచేయని కారణంగా రోగులు, గర్భిణీ స్త్రీ లు, వృద్ధులు వైద్య సేవలు కోసం వచ్చి నిలబడలేక ఇబ్బంది పడ్డారు. దానికి తోడు ఆసుపత్రికి వచ్చే రోగులు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని సిబ్బంది చెబుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటివరకు రోగుల వద్ద ఫోన్ ఉండి ఆధార్ కార్డు నెంబర్ చెబితే ఆన్లైన్ గోపి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేది.అలాంటిది ప్రస్తుతం ఒరిజినల్ ఆధార్ కార్డు కావాలని కోరుతుండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఉదయం 9 గంటలకు వెళ్ళినా ప్రజల సైతం మధ్యాహ్నం 12:30 వరకు ఓపి కౌంటర్ వద్ద బారులు తీరి నిలబడినా ఓపి టికెట్లు చేతికి రాకపోవడంతో ప్రజల ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లైన్ కు సంబంధించి సర్వర్లు పనిచేయని సమయంలో పాత పద్ధతి ద్వారా ఓపి కాపీ లు అందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

నిజం న్యూస్ బిక్కవోలు ప్రతినిధి ఫిబ్రవరి 10 తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమని బిక్కవోలు జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఎం.దుర్గాదేవి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోగల 38 అంగనవాడి కేంద్రాలు ,మరియు 22 ప్రభుత్వ పాఠశాలలు, ఆరు ప్రైవేటుపాఠశాలలు,రెండు జూనియర్ కళాశాలలు,ఒక డిగ్రీ కళాశాల నందు ఒకటి నుండి 19 సంవత్సరాలు వయస్సుగల 6,400 విద్యార్థులకుగాను



6092(95.18%)మందికి ప్రతి ఆరు మాసాలకు ఇచ్చు ఆల్ బెండ జోల్ మాత్రలు మింగించుట జరిగిందని. ఈ ఆల్ బెండ జోల్ తీసుకోవడంవలన కలిగే ఉపయోగాలు గురించి తెలియజేశారు తదుపరి ఇల్లపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందుజరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది,వివిధపాఠశాలఉపాధ్యాయులు, ఎం.ఎల్ హెచ్.పీస్,ఏ.ఎన్.ఎమ్స్,ఆరోగ్య కార్యకర్తలు,ఆశ వర్కర్లు,సూపర్వైజర్స్ పాల్గొన్నారు

Printed, Published and Owned by KAMELLA KANTHAIAH Printed at CHAITHANYA PUBLICATIONS, H.No. 1-132,Sai Baba Theatre Road, Huzurnagar, Dist:Suryapet-508204, Telangana., and Published at H.No. 2-166,Yepala Singaram (V), Huzurnagar (M), Suryapet-508204,Telangana. Editor: KAMELLA KANTHAIAH. RNI. No:TELTEL/2022/83478. Cell:9848581888. Email Id: varshaspurthi@gmail.com.

## జూద క్రీడలపై ఉక్కుపాదం మోపాలి



కాకినాడ జిల్లా జి వేమవరం నిజం బ్యూరో( రామరాజు) ఫిబ్రవరి 10:- జి.వేమవరంలో కోడిపందాలను అడ్డుకున్న జిల్లా ఎస్ పి బిందుమాధవ్ చర్యల పట్ల హర్షం పౌరసంక్షేమ సంఘంకోడిపందాలు పేకాట గుండాట వంటి జూదాలు ఎక్కడ వీలుంటే అక్కడ నిత్యకృత్యంగా తయారవుతున్నందున ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. కాకినాడ జిల్లా జి వేమవరంలో కొనసాగుతున్న కోడి పందాల నిర్వహణను అడ్డుకుని నిర్మూలన చేయించడం పట్ల జిల్లా ఎస్ పి జి బిందు మాధవ్ వహించిన చర్యలను పోలీస్ యంత్రాంగాన్ని ప్రత్యేకంగా ఒక ప్రకటనలో అభినందించారు. కాకినాడ నగరం గ్రామీణ నియోజక వర్గాల్లోని పలు ఇండ్లల్లో పేకాట క్లబ్బులు కుటీర పరిశ్రమల తరహాలో ఎక్కువవుతున్నాయని వీటిని స్థానిక పోలీస్ స్టేషన్ల నిఘా ద్వారా నియంత్రణ చేసేందుకు సంచార వాహనంపై పోలీస్ మైక్ ద్వారా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా హెచ్చరిక ప్రకటనలు చేయించాలన్నారు. జూద క్రీడలపై పోలీస్ ఫిర్యాదులకు ప్రత్యేక వాట్సప్ నంబర్ ప్రకటించాలన్నారు. లోకల్ చానల్స్ ప్రసారాల్లో ప్రకటనలు చేయించాలన్నారు. పూర్తి స్థాయిలో జూద క్రీడలు కట్టడి చేయాలని పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. జూద క్రీడల వలన బాలురు యువకుల జీవితాలు దారి తప్పుతున్నాయన్నారు.

## రుణమాఫీ కానీ రైతుల ఆవేదన



గోపాల్పేట మండలం రిపోర్టర్ తేదీ 10 సోమవారం (నిజం చెబుతాం)గోపాల్పేట మండల కేంద్రంలో రుణమాఫీ కానీ రైతులు ఈరోజు బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా మండల అధికారి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి రుణమాఫీ చేసిందని అబద్ధాపు మాటలు మాట్లాడడం బాధాకరం ఇంకా గోపాల్పేట మండలంలో కానీ రాష్ట్ర మొత్తంలో రెండు లక్షల రుణమాఫీ చాలామంది రైతులకు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో రైతుకు బాసటగా బీ ఆర్ఎస్ ప్రభుత్వ ఉంటుందని బీ ఆర్ఎస్ నాయకులు వారి వెంట ఉన్నారు

## ప్రజావాణి నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా కలెక్టర్

### - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 10 (నిజం చెవుతాం)సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 46 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తూడుకుర్తి నుండి భాగ్యనగర్ కాలనీ వరకు బిటి రోడ్లు మంజూరు



### - ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ రిపోర్టర్ 10 (నిజం చెపుతాం)నాగర్ కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామం నుండి భాగ్యనగర్ కాలనీ వరకు నూతనంగా మంజూరు చేసిన బీటీ రోడ్డు పనులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రహదారి సమస్యలతో దృష్టికి తీసుకురావడం జరిగిందని. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కోటి రూపాయల నిధులతో నూతనంగా రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు ,మాజీ ఉప సర్పంచ్ కర్ణాకర్తో తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీసీఐ ఎలక్షన్ కమిటీ మీటింగ్...

### - ముఖ్యఅతిథి గా అనంతశర్మ సిసిఐ నేషనల్ చైర్ పర్సన్

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం)వినియోగదారుల నేషనల్ చైర్ పర్సన్ శ్రీ డాక్టర్ అనంత శర్మ ఉత్తరప్రదేశ్ మహారాష్ట్ర తెలంగాణ రాష్ట్రాల పర్యటనలో భాగంగా నేడు10-2-2025 ఉదయం 11 గంటలకు మాసబ్ ట్యాంక్ నందు ఏర్పాటు చేసినటువంటి వినియోగదారుల సంఘా సభ్యుల సమావేశంలో హాజరై వినియోగదారుల హక్కుల పై అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో వినియోగదారుల ఉద్యమ వ్యాప్తి కోసం కన్జ్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ %శ్రీ%తెలంగాణ కమిటీని ఏర్పాటు ఈ కమిటీ తెలంగాణ రాష్ట్రంలోని వినియోగదారుల ఉద్యమకారుల సహకారంతో ఉద్యమ వ్యాప్తికి కృషి చేస్తుంది ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో వినియోగదారుల ఉద్యమం ప్రారంభమై 40 సంవత్సరాలు అయినప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగదారుల చెంతకు చేరకపోవడం వినియోగదారుల హక్కులు బాధ్యతల పై అవగాహన కల్పించవలసినటువంటి ప్రభుత్వాలు గత 15 సంవత్సరాలుగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు జరపకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో తూనికలు కొలతల్లో మోసాలు మోసపూరిత ప్రకటనలు సైబర్ నేరాలు నియంత్రణలో లేని అధిక ధరలు, మరియు కల్తీల విషయానికి వస్తే ఉదయం పాల నుండి మొదలుకొని రాత్రి నిద్ర పోయేంతవరకు వినియోగదారుడు వినియోగించేటువంటి ఆహార పదార్థాలు మొదలుకొని చివరికి తల్లిపాలు కూడా కల్తీ ఐతున్నటువంటి తరుణంలో వినియోగదారుడు జబ్బుల బారిన పడి ఆసుపత్రులకు వెళుతూ ఉంటే ఆసుపత్రులలో సైతం వినియోగదారుడు దోపిడికి గురి అవుతున్నాడు మరియు తమ జీవిత కాలంలో సంపాదించినటువంటి సంపాదన తమ యొక్క వైద్యానికి మరియు పిల్లల విద్యకు సరిపోవడం లేదు గూడు కట్టుకుందామని సంపాదించిన సంపాదనతో ప్లాట్లు కొనుక్కుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో మోసపోయిన వినియోగదారులు ఎందరో ఇటువంటి తరుణంలో దేశంలో ఉన్నటువంటి వినియోగదారుల సంఘాలు ఏకత్రాటిపై వచ్చి ఉద్యమము కొనసాగుతూనే వినియోగదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షులు శంకర్ లాల్ చౌరసియా ఒక పత్రిక ప్రకటనలు తెలియపరచుచున్నారు. అదేవిధంగా సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా మామిడి భీమ్ రెడ్డి



ని ఎన్నుకోవడం జరిగింది. భీమ్ రెడ్డి మాట్లాడుతూ కన్స్యూమర్ యాక్టివిస్టులు ఎప్పటికప్పుడు అవేర్నెస్ ప్రోగ్రాం లు పెడుతూ ప్రజలను మోసం చేస్తున్న మోసాల అరికడుతూ కన్జ్యూమర్ యాక్టివిస్టులు పనిచే చేయాలి అని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో హరిబాబు, శివ పార్వతి,డి గోపాల్ నారాయణ, డాక్టర్ హరిప్రియ రెడ్డి, బి ఎన్ రావు , అయూబ్ ఖాన్, డాక్టర్ శ్రీ పూజ, శిల్పారెడ్డి, కొమ్ము వెంకటేష్, బంకల రవీందర్, అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలు తప్పకుండా పాటించాలి

### - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం)రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత లో భాగంగా సోమవారం ఉదయం ఐ.డి.ఒ.సి నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ లో మండల స్థాయి మాస్టర్ ట్రైనర్ లకు జిల్లా స్థాయి మాష్టర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని, పోలింగ్ సిబ్బంది తనకు తోచినట్లుగా వ్యవహరించడానికి వీలు లేదని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ పై జిల్లా స్థాయి మాష్టర్ ట్రైనర్ లు ఇచ్చే ఎన్నికల నిర్వహణ శిక్షణను బాగా అర్థం చేసుకొని మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందువల్ల శిక్షణ ఏ స్థాయిలో ఉన్న ఎలాంటి అనుమానాలు లేకుండా అన్ని నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మండల ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహిస్తున్నందున బ్యాలెట్ బాక్సు ఏవిధంగా తెరవాలి, సీల్ ఏవిధంగా చేయాలి ఎన్నికల నిబంధనలు ఏవిధంగా ఉంటాయో ఫిజికల్ గా చూపించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డి.పి. ఒ సురేష్, జడ్పి సీఈఓ యాదయ్య, మాష్టర్ ట్రైనర్ శ్రీనివాస్, మండల ట్రైనర్లు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ స్టేషన్ల వివరాలు పరిశీలించాలి

### - అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం)సోమవారం సాయంత్రం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలక్టర్ వివరిస్తూ గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల వివరాలు వెల్లడించడం జరిగిందని, గోపాలేపేట మండలంలోని జింకలబీడు గ్రామ పంచాయతీ, కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీల్లో ముసాయిదా పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వడం జరిగిందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిబ్రవరి 13న జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే సమావేశంలో చెప్పాలని సూచించారు. గోపాల్ పేట మండలం జింకల బీడు తాండా లో ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, అంగన్వాడి సెంటర్ లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీలో అప్పర్ ప్రైమరీ స్కూల్ లో 10 పోలింగ్ కేంద్రాలు, అంగన్వాడి కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వీటిలో ఏమైనా అభ్యంతరం ఉంటే చెప్పాలని సూచించారు. ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సైతం ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఫిబ్రవరి 13న ప్రకటించడం జరుగుతుందని వాటిని పరిశీలించి అదేరోజు జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో చెప్పాలని సూచించారు. శ్రీరంగాపూరు మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ ప్రతినిధి రాజేందర్ మాట్లాడుతూ శ్రీరాంగాపూర్ గ్రామ పంచాయతీలో ఒకే చోట పోలింగ్ కేంద్రాలు ఉండటం వల్ల ఓటర్లకు దూర భారం పడనుందని అందువల్ల వాటిని విభజిస్తే బాగుంటుందని అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన అదనకు కలక్టర్. ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితా సందర్భంగా



పరిశీలిస్తామని వివరించారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.పి. ఒ సురేష్, కాంగ్రెస్ నుండి రాజేందర్, యం. ఐ.యం నుండి రహీమ్, టి.డి.పి. నుండి కొత్తగొల్ల శంకర్, భారాస నుంచి సయ్యద్ జమీల్, బసపా నుంచి జి. భరత్, భాజపా నుంచి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట గౌడ ఉద్యోగ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కోదాడ, ఫిబ్రవరి 09(నిజం చెపుతాం) కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో మండవ ఉపేందర్ గౌడ్ నివాసంలో సూర్యాపేట గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. కోదాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు మండవ ఉపేందర్ గౌడ్ అధ్యక్షతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా , డివిజన్ నాయకుల సమక్షంలో నిర్వహించారు. కుల వృత్తుల్లో గౌడ వృత్తి చాలా ప్రమాదకరమైందని ప్రభుత్వం వారు ఆకస్మిక ప్రమాదాలకు వెంటనే ఎక్స్రేషియా అందించాలని, అలాగే ఆర్థికంగా వెనుకబడిన గౌడులను బిసి ఎ లో చేర్చాలని దీన్ని ఒక ఉద్యమంగా తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. గౌడ ఉద్యోగులమైన మనం గౌడ సమాజానికి సేవ చేయాలని, రాబోయే తరాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. బీసీ కులంలో ఎక్కువ కులాలు ఉండడం వలన గౌడ కులస్తులకు సరియైన న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న సొసైటీ అధ్యక్షుడు పులుసు సాయిబాబా గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలుగూరి కిరణ్ గౌడ్, కోదాడ డివిజన్ గౌరవ అధ్యక్షులు బెల్లంకొండ గోవర్ధన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్ గౌడ్, సూర్యాపేట డివిజన్ నాయకులు సురభి శ్రీధర్ గౌడ్, అల్లాడి సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కొండా వెంకయ్య గౌడ్ ,బెల్లంకొండ సత్యనారాయణ గౌడ్, జిల్లా కార్యదర్శులు కొంపెల్లి శ్రీనివాస్ గౌడ్, బాలేబోయిన వీరయ్య గౌడ్, మట్టపల్లి మహేష్ గౌడ్ కోదాడ డివిజన్ అసోసియేట్ అధ్యక్షుడు బండి సైదులు గౌడ్, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గండు నాగయ్య గౌడ్, డివిజన్ కార్యదర్శులు నారగోని సునీత గౌడ్, బత్తిని గోపి గౌడ్, డివిజన్ గౌడ ఉద్యోగస్తులు గుండు నాగరాజు గౌడ్ , రాంపల్లి జైపాల్ గౌడ్ , నాగమణి గౌడ్ , నేరెళ్ల మాధవి గౌడ్ , బొడ్డు శ్రీనివాస్ గౌడ్ , అలవాల శాంత కుమార్ గౌడ్, మొక్క రంగయ్య గౌడ్, చెనగాని రవి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా థర్డ్ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2025 బ్యాడ్మింటన్ కేటగిరిలో కంశ్య పథకాన్ని సాధించిన చిలుకూరు గ్రామస్తుడు అమరగాని రాంబాబు గౌడ్ , విద్యుత్ విభాగంలో అవార్డులు పొందిన గుడిపూడి శ్రీనివాస్





గౌడ్, మేకపోతుల రమేష్ గౌడ్, పాడిసెట్టి శ్రీనివాస్ గౌడ్ లను జిల్లా, డివిజన్ గౌడ ఉద్యోగ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.

# రైస్ మిల్లుఅమాలి కార్మిక సంఘం మిల్లు యజమాన్యానికి వినతి పత్రం అందించడం జరిగింది

హుజూర్ నగర్ ఫిబ్రవరి 10 నిజం చెపుతాం న్యూస్హుజూర్నగర్ రైస్ మిల్ అమాలి కార్మిక సంఘం రైస్ మిల్ యాజమాన్యం కు 10 డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం ఇవ్వనైనది. ఇప్పుడున్న ధరలపై అదనంగా 30% ఇవ్వాలని, బోనస్, పిఎఫ్, గ్రాట్యుటీ, లాంటి సౌకర్యాలు కల్పించాలని, లారీ దిగుమతి మామూలు, ట్రాక్టర్ దిగుమతి మామూలు, బోరాల దిగుమతి, వలస కార్మికులకు కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని కోరినారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పూణేల్లో పాండురంగ హడావు నాయకత్వంలో హమాలీలంతా సంఘటితమై పోరాడి అనేక హక్కులు సాధించుకున్నారని, బస్తాలు మోసి మోసి మోకాళ్లు, వెన్నెముక అరిగిపోతున్నాయని వారికి ప్రభుత్వమే ఉచితంగా వైద్య సహాయం చేయాలని డిమాండ్ చేసి విజయం సాధించారన్నారు. ఇంకా విద్య, సహకార బ్యాంకు తదితర సౌకర్యాలతో పాటు వీటన్నిటిని చట్టబద్ధం చేస్తూ 1969 లోనే మత్తడిలాని తెచ్చిందని ఇక్కడ కూడా ఆ రకమైనటువంటి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత విద్య, వైద్యం పారిశ్రామిక వాడలో విశ్రాంతి భవనం నిర్మించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు పాత్తబోయిన గురవయ్య, రాజు, పటేల్, ప్రభు, చిన్న నాగేశ్వరరావు, ముఖేష్ రైస్ మిల్ యాజమాన్యం నుండి అధ్యక్షులు పోలిశెట్టి నరసింహారావు, మాజీ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు



# డి ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం

హుజూర్ నగర్ ఫిబ్రవరి 10 నిజం చెపుతాం న్యూస్ డి ఎస్ ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుబాటి బాబురావు మాట్లాడుతూడిఎస్ఆర్ ట్రస్ట్ ప్రజలకు ఆపదలో అన్నివేళలా అందుబాటులో ఉంటుంది దగ్గుపాటి బాబురావు హుజూర్ నగర్ పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రి నందు బుచ్చమ్మ కి గర్భసంచి ఆపరేషన్ కొరకు బి పాజిటివ్ బ్లడతక్కువ ఉందని డిఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు సంప్రదించగాబాబురావు వెంటనే డోనారపరిటాల నాగరాజకు ఫోన్ చేసి చెప్పి కోదాడ బ్లడ్ బ్యాంక్ కు పంపించి మరియు హాస్పిటల్ దగ్గర కూడాపంపించి రక్తం ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా పేషెంట్ తాలకు బంధువులుదగ్గుపాటి బాబురావు, డోనార్ పరిటాల నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా పరమ పదోత్సవం



హుజూర్ నగర్ ఫిబ్రవరి 10 నిజం చెపుతాం న్యూస్ స్థానిక శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో అధ్యయనోత్సవాలలో భాగంగా నేడు మూడవ రోజు ప్రాతఃకాలంలో పల్లకి సేవ జరిగింది. నమ్మాళ్వార్లు పల్లకిలో వేంచేసి దేవాలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఆలయంలో భద్ర పీఠంపై నమ్మాళ్వార్లు వేంచేసి షోడషోపచార పూజలను అర్చకులు నిర్వహించారు. ప్రధాన అధ్యాపకులు శ్రీ మాన్ బదరీ నారాయణా చార్యులు నమ్మాళ్వార్ల వైభవాన్ని, పరమ పదోత్సవ ప్రాముఖ్యతని భక్తులకు వీనుల విందుగా వివరించారు. తి తి దే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ తిరుప్పావై ప్రచారకులు ముడు%శీ%బై దామోదరా చార్యులు పాడిన ఆళ్వారు కృప సేయవే కీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మామిడి తోరణాలతో దేవాలయం కళకళలాడుతూ వుంది. ఉదయం, సాయంత్రం పల్లకీ సేవలు నిర్వహిస్తున్నారు. ఇట్టి కార్యక్రమంలో ఈ.వో గుజ్జుల కొండారెడ్డి, అధ్యాపకులు శ్రీ మాన్ రామచంద్రా చార్యులు, స్థానాచార్యులు, అర్చకులు మురళీకృష్ణమా చార్యులు, భాస్కరా చార్యులు మహిళలు గుండా ఆండాలు,ఉప్పల పద్మ, వెన్న పద్మ ,వంకాయల పద్మ, పిచ్చమ్మ, భారతమ్మ, సుకన్య, లలిత మొదలగు వారు పాల్గొన్నారు.

# కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కోదాడ కొపాఖాన్ క్లబ్ విద్యార్థుల ప్రతిభ

## - పలువురికి బంగారు సిల్వర్ మెడల్స్




కోదాడ రూరల్ న్యూస్ ఫిబ్రవరి 10( నిజం చెబుతాం )వరంగల్ జిల్లా నర్సంపేట లో జరిగిన తొమ్మిదవ జాతీయ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కోదాడలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన కోపో ఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించినట్లు కోచ్ మాధవి లత సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. విజేతలకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ రచ్చ శ్రీని బాబు బహుమతులు అందజేశారు అని తెలిపారు. కాగా విజేతల్లో అండర్ సెవెన్ లో తుహీన గోల్డ్ మెడల్, అండర్ 8లో శాన్విత గోల్డ్ మెడల్, అండర్ 10 లో ఆరాధ్య గోల్డ్ మెడల్ అండర్ 13 లో తెర్ధ గోల్డ్ మెడల్ బాలుర విభాగంలో అండర్ 9లో నాగరుద్ధ గోల్డ్ మెడల్ అండర్ 6 లో మీరా సిల్వర్ మెడల్, అండర్ 9 లో శ్రీ యాన్ సిల్వర్ మెడల్ అండర్ 15 లో సింధ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నట్లు ఆమె తెలిపారు సందర్భంగా కోదాడ కోపోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు జాతీయస్థాయిలో పథకాలు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలతో పాటు కోచ్ మాధవి లతను అభినందించారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా కుంభమేళకు...







గండిపేట్, ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం): లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహా కుంభమేళకు 107 మంది బయలుదేరి వెళ్లారు. ఆదివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మహారాష్ట్రలోని నాగపూర్ రామ్ టెక్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వామివారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విప్పు మత్తూర్, రెడ్డిశెట్టి కృష్ణమూర్తి, కంచర్ల వెంకటేష్ గుప్తా, భీమిశెట్టి, దశరథం, వేముల రాములు, మలిపెద్ది రాములయ్య, సత్యం, శంకర్, కార్తీక్, ముప్పిడి రాజేష్, ఆకారం నరసింహులు, సదానంద్ ప్రసాద్ తివారి, మల్లికార్జున్ రెడ్డి, కౌకుంట్ల వినయ్, మంచి కంటి నర్సింలు, రవికంటి కిషన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ లో పవర్ బోర్ ప్రారంభోత్సవం చేసిన లిఅంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్



అంబర్పేట్: జనవరి10( నిజం చెపుతాం )ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లిగౌరవనీయులు పెద్దలు అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ లో గత కొన్ని సంవత్సరాలుగా నీళ్లకి ఇబ్బంది పడుతున్నటువంటి విషయాన్ని స్థానికులు మరియు కార్పొరేటర్ ద్వారా తెలుసుకొని సొంత %జణ్గూ% నిధులు మంజూరు చేసి పవర్ బోర్ ఏర్పాటు చేయించడం జరిగిందని తెలియజేశారుఈరోజు ప్రేమ్ నగర్ లో స్థానిక బస్తి ప్రజలు బిఆర్ఎస్ పార్టీ నాయకుల సమక్షంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పాక నర్సింగ్ ఆధ్వర్యంలో అంబర్పేట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ గారు ఘనంగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో సంబంధిత జలమండలి అధికారులు ఏఈ ప్రదీప్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్మెన్లు నరసింహ,%ూఖీూ% లు పాష, శ్రీనివాస్,భాస్కర్,ప్రణయ్ మరియు బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,మహిళా నాయకులు,మైనార్టీ నాయకులు,స్థానిక బస్తీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింద

# బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలి

## - బీసీ మహాసభ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్ నగర్ నిజం చెపుతాం ఫిబ్రవరి 10 తెలంగాణలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని కులగణనలో భాగంగా రేవంత్ సర్కార్ చూపించిన చిత్తశుద్ధి మరియు ప్రభుత్వం చూపలేదని బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బీసీ మహాసభ 2025 సంవత్సరం డైరీని నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనపాటీ ప్రదీప్, రంగారెడ్డి జిల్లా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు మంగ అశోక్ రాష్ట్ర సమితి కార్యదర్శి మారబోయిన సదానంద యాదవ్ స్టేట్ స్టీరింగ్ కమిటీ ఆర్య కటిక కృష్ణంరాజు వేణుగోపాల్ మాధవాచారి రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ విభాగ నాయకులు శ్రీనివాస్ యాదవ్, జిల్లా కమిటీ నాయకులు యాదయ్య మీడియా ఇంచార్జ్ మల్లేష్ ముదిరాజ్ బీసీ మహాసభ పట్టణ యువత పాలాది శ్రీనివాస్ పద్మశాలి ఢిల్లీ రమణలతో పాటు స్థానిక నాయకులు తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. వెనుకబడిన తరగతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీధర్ వర్మ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు మెట్టుకడు శ్రీనివాస్ వెనుకబడిన బీసీ కులాలను చైతన్యపరచాలని సబ్బండ కులాల ఆలోచన కార్యాచరణలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ కల్పన కోసం నిరంతరం బీసీ మహాసభ పోరాటం ఆగదని అన్నారు తెలంగాణలో నూటికి 65% ఉన్న బీసీలు విద్యా ఉద్యోగ ఆర్థిక సామాజిక రాజకీయ అన్ని రంగాలలో ప్రాధాన్యత మరియు భావితను భవిష్యత్తు కోసం సామాజిక ఆత్మగౌరవం ఈ నినాదంతో మహాసభ మరిన్ని కార్యక్రమాలకు పునాది వేయబోతుందని అన్నారు..

# రైతు మహాధర్నా మద్దతుగా కదలిన మారబోయిన రవి కుమార్ యాదవ్





శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 10 ( నిజం చెపుతాం ) : - కొడంగల్ గడ్డ పై పిబ్రవరి 10 తేదీన బీ ఆర్ ఎస్ రైతు మహా ధర్నా కు బయలుదేరిన బి ఆర్ఎస్ యువ నాయకుడు మరబోయిన రవి యాదవ్ కేటీఆర్ పిలుపుమేరకు రైతు ధర్నా ను విజయవంతంగా చేయాలని సోమ వారం శేరిలింగంపల్లి నుంచి ర్యాలీ గా బయలు దేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఎన్ని సార్లు రైతులని మోసగిచ్చి మభ్యపెట్టి రైతులని ఏ మార్చుతారని రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై టిఆర్ఎస్ నాయకుల పోరాటం ఆగదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట ప్రకారం ఆచరణలో చూపి రైతు భరోసా వెంటనే తీర్చాలని టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అని కోరుతూ ధర్నాకు మద్దతుగా నిలిచారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని మారబోయిన రవి యాదవ్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

# నేడు నిర్వహించే వేలం పాటలో పాల్గొన గలరు

## - ఎక్సైజ్ సీఐ బద్యా నాద్ చౌహన్..




మాడ్గుల ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం):ఆమనగల్ ప్రొబి షన్ %ఆ% ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మాడ్గుల, తలకొండపల్లి,కడ్తాల్, ఆమనగల్ మండలాలలోని వివిధ గ్రామాలలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నేడు వేలం వేసున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యా నాద్ చౌహన్ తెలిపారు.నేడు ఉదయం 10:30నిర్వహించే వేలంలో పాల్గొనదలచిన వారు ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగలరని ఎక్సైజ్ సూచించారు.

# చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీం



తల్లాడ ఫిబ్రవరి 10 (నిజం చెప్తాం) ఈరోజు ఖమ్మం జిల్లా మధిర జూనియర్ ఇంజనీరింగ్ కాలేజీ మరియు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి నటువంటి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ తేలూరి చిన్న ఏసు మరియు ఖమ్మం జిల్లా అడ్వైజర్ యశోద మరియు ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కోడూరు మంగతాయి మరియు ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కల్పన తదితరులు పాల్గొనడం జరిగినది యొక్క ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం పిల్లలకు చట్టాలపై హక్కులపై అవగాహన కల్పించుటకు మీటింగ్ ఏర్పాటు చేయాలని అడగగా ప్రిన్సిపాల్ సర్ వెంటనే స్పందించి తప్పకుండా మీటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది అదేవిధంగా 2013 ఇంటర్నల్ కమిటీ వేయాలని అడగగా వెంటనే స్పందించి కమిటీ కూడా వేస్తానని చెప్పినటువంటి పాఠశాల కళాశాల యాజమాన్యానికి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నాము ఇట్లు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ అధ్యక్షులు మరియు నేషనల్ కోఆర్డినేటర్

# మణుగూరు మండల మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి సత్యనారాయణ: ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంమాల మహానాడు ముఖ్య కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. , ఈ సమావేశానికి మండలంలోని మాల మహానాడు పెద్దలు పాల్గొని మణుగూరు మండల మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులుగా వేర్పుల నరేష్, ప్రధాన కార్యదర్శిగా బూర్గుల సతీష్, గౌరవ అధ్యక్షులుగా మద్దెల భద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా దాసరి వెంకట్, వేర్పుల సురేష్, ఉపాధ్యక్షులుగా బూర్గుల సంజీవరావు, సబ్బతి ఏసు రత్నం, ముల్క నరేష్, సహాయ కార్యదర్శులుగా వేమూరి రవి, పప్పుల ప్రసాద్, కోశాధికారిగా చింతమల్ల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా తోట ప్రసాద్, చెలికాని రామకృష్ణ, ఉల్లోజు బాబురావు (బాబీ) లతో పాటు మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వేర్పుల నరేష్, బూర్గుల సతీష్ లు మాట్లాడుతూ మాలలకు ఎటువంటి ఆపద వచ్చిన ముందుంటామన్నారు. తమను గౌరవించి పదవి ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా రుణపడి ఉంటామన్నారు. క్రమశిక్షణతో అందరితో మమేకమై అందరి ప్రేమ అభిమానాలు పొందుతామన్నారు. మాలల సామాజిక వర్గం గురించి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామ ని మాలల అభ్యున్నతికి తోడ్పడుతామన్నారు. అన్ని గ్రామాల మాలలను ఏకం చేసి ముందుకు సాగుతామని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కమిటీ దృష్టికి తీసుకోవచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో దాసరి ఏసురత్నం, కందుకూరి యాకోబు, రామకృష్ణ, గొడిశాల నాగమళ్ళు, వేర్పుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి







## - న్యాల్కల్ మండల పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్

సంగారెడ్డి నారాయణ ఖేడ్ ప్రతి నిది తుక్కా రెడ్డి పిబ్రవరి 10(నిజం చెపుతాం )నారాయణ ఖేడ్... ప్రతీ పాడి రైతు పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకొని మేలు జాతి పశు సంపదను పెంచాలని న్యాల్కల్ మండల పశు వైద్యాధికారి డా గణేష్ అన్నారు. సోమవారం నాడు జిల్లా పశు ఘణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మరియు పశుసంవర్ధక శాఖ సహకారం తో రుక్మాపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో అయన పాల్గొని పశు వులకు గర్భస్తపరీక్షలు. సాధారణ చికిత్సలు. మరియు దూడలకు నట్టల నివారణ మందులు వేసారు మరియు కాలనుగుణంగా వచ్చే వ్యాదులు.. గర్భకోశవ్యాదుల గురుంచి రైతులకు అవగాహన కల్పించారు.మరియు అవసరం అయిన వాటికి తగినమందులను అందజేశారు. డా గణేష్ గోపాల మిత్ర సూపర్ వైజర్ తుక్కారెడ్డి.మాజీ ఎం పి. టీ. సి. ఏ. నర్సింహా రెడ్డి.మాజీ సర్పంచ్ నర్సింహా రెడ్డి గోపాల మిత్రలు ఏ జనర్దన్ రెడ్డి. చంద్రయ్య. నాగప్ప పాడి రైతులు ఉన్నారు ఈ సందర్భంగా డా గణేష్.. సూపర్ వైజర్ తుక్కా రెడ్డి. గోపాల మిత్రలు జనార్దన్ రెడ్డి. చంద్రయ్య ను గ్రామస్తులు సన్మానం చేసారు.

# బండారి పద్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పించిన నాయకులు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి / ఉప్పల్ ఫిబ్రవరి 10 (నిజం చెబుతాం)అనారోగ్యంతో మరణించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వదిన బండారి పద్మ పార్థివ దేహాన్ని సైనిక్ పూరి లోని తన నివాసంలో సందర్శించి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ,మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ మండలంలోఎమ్మెల్యే పోచారం జన్మదిన వేడుకలు



కోటగిరి,ఫిబ్రవరి 10 (నిజం చెపుతాం ): నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి  జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, ఉమ్మడి మండలాల యూత్ అధ్యక్షుడు చాంద్ పాషా, మాధవ రావు పటేల్, అభిషేక్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మందముల పరమేశ్వర్ రెడ్డికి టీయూడబ్ల్యూజే జిల్లా డైరీని అందజేసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి / ఉప్పల్ ఫిబ్రవరి 10 ( నిజం చెబుతాం )మేడ్చల్ జిల్లా  టి యు డబ్ల్యూ జే యూనియన్ జర్నలిస్టు డైరీ ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి కలిసి ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది

# ద్దిరెడ్డి కుటుంబం ఒక ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది: వర్ల రామయ్య

**- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్ల రామయ్య ప్రెస్ మీట్**

**- పెద్దిరెడ్డి కుటుంబం రాష్ట్రంలో ఒక మాఫియాలా తయారైందని విమర్శలు**

**- అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారని వెల్లడి**

పెద్దిరెడ్డి కుటుంబం రాష్ట్రంలో ఒక మాఫియాలా తయారై... ఒక ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు వర్ల రామయ్య మీడియా సమావేశం నిర్వహించారు. గతంలో తన అక్రమ సంపాదనతో జగన్ ను పడగొట్టి తాను ముఖ్యమంత్రి కావాలని కూడా పెద్దిరెడ్డి అనేకసార్లు ప్రయత్నించారని ఆరోపించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని... గనులు, ఖనిజం, ఇసుక, ప్రభుత్వ స్థలాలు, పేదల, అటవీ భూములు, ఎర్రచందనం, యథేచ్ఛగా దోచుకున్నారని అన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే సామ, దాన, భేద, దండోపాయాలు ఉపయోగించి నోరు మూయించేవారని తెలిపారు. అధికారులు కూడా వీరి చేష్టలు చూసీ చూడనట్లు ఉండాల్సిందేనని, ఎదురుతిరిగితే తిప్పలు తప్పవని వివరించారు. పెద్దిరెడ్డి 238 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించాడంటే... అటవీ చట్టం ఇతనికి ఎన్ని జీవిత శిక్షలు వేయొచ్చో చెప్పాలి. గనుల శాఖలో 400 మందికి ప్రైవేటుగా ఉద్యోగాలిచ్చాడంటే ఈ పెద్దిరెడ్డి ఎంతటి ఘనాపాటో అర్థం చేసుకోవచ్చు. పెద్దిరెడ్డి ప్రెస్ లో తాను తప్పు చేయలేదని ఎప్పుడూ చెప్పలేదుగానీ... నన్నెవరూ ఏమీ చేయలేరని మాత్రం పదే పదే చెప్పేవాడు. పెద్దిరెడ్డి పాపాల్లో జగన్ కు భాగముండబట్టే ఇతని అవినీతి సామ్రాజ్యాన్ని జగన్ ఏనాడూ ప్రశ్నించలేదు. చంద్రబాబు పుంగనూరు వెళతానంటే.. నా పుంగనూరులో అడుగుపెట్టడానికి వీల్లేదని నిరోధించిన అరాచకవాది ఈ పెద్దిరెడ్డి. గనులేమో పెద్దిరెడ్డి, అటవీశాఖ పెద్దిరెడ్డి శ్రీమతికి, మద్యం అవినాష్ రెడ్డికి, ఎర్రచందనం పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకనాథ్ రెడ్డికి... ఇలా పంచుకుని రాష్ట్రాన్ని కొల్లగొట్టారు. అనేక ఎకరాల అటవీ భూములను కొల్లగొడుతుంటే అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు. అటవీశాఖ అధికారులు ఇప్పుడైనా రంగంలోకి దిగాలి. విజిలెన్స్ రిపోర్టును బేస్ చేసుకొని రంగంలోకి దిగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేం డిమాండ్ చేస్తున్నాం. రాక్షస సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న పెద్దిరెడ్డిపై వెంటనే ఫారెస్టు యాక్టు కింద కేసు రిజిష్టర్ చేయాలి. పెద్దిరెడ్డి కుంటుంబం విదేశాలకు పారిపోయే అవకాశముంది, కావున ఆ నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వారి పాస్ పోర్టులు స్వాధీనం చేసుకోవాలి. ఫారెస్టు యాక్టుల నుంచి తప్పించుకోవడం అంత సులభం కాదు, నాన్ బెయిలబుల్ యాక్టులున్నాయి. ఈ దుర్మార్గులకు ఆ సెక్షన్లు ఆపాదించాలి. పెద్దిరెడ్డి వెయ్యి తప్పులు పూర్తయ్యాయి... కావున దండన తప్పదు. పెద్దిరెడ్డిపై ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుంది. పెద్దిరెడ్డి పనైపోయింది, ఇక కోరలు పీకిన పాములాంటివాడు. పుంగనూరు ప్రాంతంలోని రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు శాఖల అధికారులు పెద్దిరెడ్డి తప్పులను వెలికితీయడంలో నిమగ్నమవ్వాలి. వారిని అరెస్టు చేసి జ్యుడిషియల్ ఎంక్వైరీకి పంపాలి. ఇక్కడ ప్రెస్ లో మాట్లాడుతుంటే, పెద్దిరెడ్డి మీద ఫిర్యాదు ఇవ్వడానికి పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ ముందు పెద్దిరెడ్డి బాధితులు క్యూ కట్టారు. పెద్దిరెడ్డి కుటుంబ అవినీతిపై వెంటనే ఈడి, ఐటీ శాఖాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టాలి. పెద్దిరెడ్డి కుటుంబం తమ విలాసాలకు కట్టుకున్న భవంతులపై కూడా విచారణ జరపాలి. తప్పకుండా ఇన్వెస్టిగేషన్ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి. పెద్దిరెడ్డి పదేళ్ల క్రితం స్కూటర్ పై తిరిగేవాడని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పాడు. ఆర్థికంగా ఇంత ఎత్తుకు ఎలా ఎదగగలిగారో ప్రజలకు తెలియజేయాలి. అటవీ భూములను కొల్లగొట్టి ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వీరికి శిక్ష పడాలి" అని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు.

# శ్రీ రమ లింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**- హాజరైన మందుముల పరమేశ్వర్ రెడ్డి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి / ఉప్పల్ ఫిబ్రవరి 10 (నిజం చెబుతాం)రామంతాపూర్ శ్రీనివాసపురం  లోని శ్రీ రమ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసి దేవాలయ కమిటీ (ధర్మకర్తలకు ) శుభాకాంక్షలు తెలిపారు  ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ ఛైర్మన్ కంది ఆగి రెడ్డి సభ్యులుగా  నాగారం శ్రీనివాస్ చారి,సంపత్ ,వేం యాకుబ్ రెడ్డి,చేవేళ్ల మల్లయ్య కురుమ,నాగరాజ్ ,శ్రీవాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆంజనేయులు,కంది శ్రవణ్ రెడ్డి ఆకారపు అరుణ్ పటేల్ ,విజయ్ కుమార్,పేట మురళి ముదిరాజ్ మార్తం ఉపేందర్ రెడ్డి,వల్లపు  శ్రీకాంత్ యాదవ్. బాబు,సాగ శ్రీధర్. సతీష్ గౌడ్. ధర్మేంద్ర నాయక్.



రాఘవేందర్. వాసు నాయక్. బిళ్ళకంటి యాదయ్య, మల్లేష్, రఘు, ప్రకేష్ , కిషోర్, భాను, నాగచారీ,భాస్కర్, చోట, పాషా,



సంజీవ్, చైతన్య,శివ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# నిజాంసాగర్ మంజీరాకాలువ లో గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నిజం న్యూస్ ఫిబ్రవరి 10నిజాంసాగర్ ప్రాజెక్టు మంజీరా కాలువ లోఆదివారం పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఎస్సై శివ కుమార్ తెలిపిన వివరాలప్రకారం ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన కర్రె విట్టల్ (40) అనే వ్యక్తి మిషన్ భగీరథలో అవుట్ సైడ్ కింద విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, ఆదివారం ఉదయం మహమ్మద్ నగర్ సమీపంలోని నిజాంసాగర్ మంజీరాకాలువలో చేప కనపడటంతో పట్టుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గల్లంతయ్యాడు. సిబ్బంది సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. వారు ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపివేసి విట్టల్ కోసం గాలింపు చేపట్టారు. అయితే, సోమవారం ఉదయం మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు మంజీరా కాలువ డిస్ట్రిబ్యూటర్ 3 వద్ద విట్టల్ మృతదేహం లభ్యమైంది.

అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ప్రాజెక్ట్ ప్రధాన కాలువలో ఆదివారం పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఎస్సై శివ కుమార్ కథనం మేరకు ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన కర్రె విట్టల్ (40) అనే వ్యక్తి మిషన్ భగీరథలో అవుట్ సైడ్ కింద విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, ఆదివారం ఉదయం మహమ్మద్ నగర్ సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేప కనపడటంతో పట్టుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గల్లంతయ్యాడు. సిబ్బంది సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. వారు ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపివేసి విట్టల్ కోసం గాలింపు చేపట్టారు. అయితే, సోమవారం ఉదయం మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటర్ 3 వద్ద విట్టల్ మృతదేహం లభ్యమైంది.



అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కర్రె సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపా ఎస్సై శివకుమార్ తెలిపా

# నిజమే..ఈ వివాదంతో విశ్వక్‌సేన్‌కు సంబంధం లేదు..!

**- పృథ్వీరాజ్ కామెంట్స్‌పై భగ్గుమన్న వైసీపీ శ్రేణులు**

**- ట్విట్టర్‌లో ట్రెండింగ్‌లో 'బైకాట్ లైలా' హ్యాష్‌ట్యాగ్**

**- క్షమాపణ చెప్పిన విశ్వక్‌సేన్**

విశ్వక్‌సేన్.. ఎటువంటి సినీ నేపథ్యం లేకుండా చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న యువ కథానాయకుడు. 'ఫలక్ నామా దాస్', 'ఈ నగరానికి ఏమైంది', 'పాగల్' వంటి చిత్రాలతో తనకంటూ ఓ మార్క్‌ను క్రియేట్ చేసుకున్నాడు. అయితే సాధారణంగా ఈ యంగ్ హీరో సినిమా విడుదల ముందు ఏదో ఒక వివాదం, ఆ సినిమా గురించి ఏదో ఒక హాట్ టాపిక్ జరుగుతుంటుంది. కొన్నిసార్లు ప్రీ రిలీజ్ వేడుకలో కాస్త వివాదాస్పదంగా మాట్లాడటం, అది వైరల్ కావడం ఏదో ఒక రకంగా విశ్వక్ సినిమా విడుదల ముందు వార్తల్లో నిలుస్తుంది. అయితే ఇవన్నీ విశ్వక్‌సేన్ పబ్లిసిటీ స్టంట్ అని కామెంట్స్ చేసేవాళ్లు కూడా లేకపోలేదు. అయితే తాజాగా విశ్వక్‌సేన్ నటించిన కొత్త చిత్రం 'లైలా'. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ నారాయణ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఇటీవల జరిగింది. ఈ ఫంక్షన్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే ఈ ప్రీ రిలీజ్ వేడుకలో 'లైలా' చిత్ర నటుడు థర్టీ ఇయర్స్ పృథ్వీ చేసిన వివాదస్పద కామెంట్స్ వైసీపీ రాజకీయ నాయకులను బాధపెట్టింది. ఇక వైసీపీ అభిమానులు సోషల్ మీడియాలో 'బైకాట్ లైలా' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ట్వీట్లు మొదలుపెట్టారు. ఇతర సోషల్ మీడియాలో కూడా పృథ్వీపై కామెంట్స్ మొదలయ్యాయి. ఇక జరిగిన డ్యామేజ్‌ను కంట్రోల్ చేయడానికి హీరో విశ్వక్‌సేన్, నిర్మాత సాహు గారపాటిలు ప్రెస్‌మీట్ పెట్టి పృథ్వీరాజ్ కామెంట్స్ పట్ల తమ క్షమాపణ తెలియజేశారు. తమకు తెలియకుండానే ఇలా జరిగిందని, దయచేసి ఎంతో కష్టపడి తీసిన సినిమాను బైకాట్ చేయడం సమంజసం కాదని, ఒక్కరు చేసిన తప్పుకు సినిమా టీమ్ అందరినీ శిక్షించకూడదని తమ ఆవేదన తెలియజేశారు. అయితే ఈ ప్రెస్‌మీట్‌కు పృథ్వీరాజ్‌ను కూడా తీసుకొచ్చి



క్షమాపణ చెప్పిస్తే బాగుండేదని వైసీపీ అభిమానులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఇంతటితో ఈ లైలా బైకాట్ వివాదం సద్దుమణుగుతుందో లేదో చూడాలి. అయితే ప్రతిసారి సినిమా విడుదలకు ముందు ఏదో ఒక వివాదంతో తెరపైకి వచ్చే హీరో విశ్వక్‌సేన్ ఈసారి మాత్రం తన ప్రమేయం లేకుండానే మరోసారి వార్తల్లో నిలిచాడు.

# రంగరాజన్ మీద దాడి ఘటనపై పోలీసుల కీలక ప్రకటన

**- ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి సహా ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడి**

**- రంగరాజన్‌ను ఆర్థిక సాయం కోరిన వీరరాఘవరెడ్డి**

**- నిరాకరించడంతో దాడి చేసినట్లు తెలిపిన డీసీపీ**

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కీలక ప్రకటన చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డితో పాటు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. తమకు ఆర్థిక సాయం చేయాలని, తాము స్థాపించిన రామరాజ్యంలో సభ్యులను చేర్చాలని వీరరాఘవరెడ్డి డిమాండ్ చేశారని, అందుకు రంగరాజన్ నిరాకరించాడని డీసీపీ తెలిపారు. ఈ క్రమంలో దాడి జరిగిందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి, ఇద్దరు మహిళలతో పాటు మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ ఉదయం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులు ఖమ్మం, నిజామాబాద్‌కు చెందిన వారని వెల్లడించారు. సాయంత్రం వీరరాఘవరెడ్డిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరరాఘవరెడ్డి 2022లో రామరాజ్యంను స్థాపించాడని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ప్రచారం చేసుకున్నట్లు చెప్పారు. రామరాజ్యంలో చేరిన వారికి రూ.20 వేలు ఇస్తానని ప్రకటించారని... రామరాజ్యంలో చేరిన వారిని యూనిఫాం కుట్టించుకోమని చెప్పారని డీసీపీ వెల్లడించారు. రామరాజ్యం బ్యానర్‌తో ఫొటోలు, వీడియోలు తీసి ప్రచారం చేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 7వ తేదీన వాహనాల్లో మరో 25 మందితో కలిసి వీరరాఘవరెడ్డి చిలుకూరు ప్రధాన అర్చకుడు రంగరాజన్



వద్దకు వచ్చి ఆర్థిక సాయం అడిగి, ఆ తర్వాత దాడి చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ప్రస్తుతం మణికొండలో ఉంటున్న వీరరాఘవరెడ్డిది తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామమని డీసీపీ తెలిపారు.

# రేవంత్ రెడ్డికి ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదు

**- రేవంత్ రెడ్డి అక్టోబర్ నుండి 11సార్లు ఢిల్లీకి వెళ్లారన్న హరీశ్ రావు**

**- రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదా? అని అడిగితే ఫోన్ చూపించారని ఎద్దేవా**

**- ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ధర్నాకు హరీశ్ రావు మద్దతు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఏడాది అక్టోబర్ నుండి ఇప్పటి వరకు 11 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇక్కడ ఏం చేస్తున్నారో ఢిల్లీ పెద్దలకు అర్థమైందన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకక ఆయన వెళుతున్నారు, వస్తున్నారని ఎద్దేవా చేశారు."మీకు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదట సర్" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మీడియా ప్రతినిధులు కూడా ప్రశ్నించారని వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నకు, నాతో మాట్లాడారు చూడండంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఫోన్ తీసి చూపించారని, అలా ఫోన్ తీసి చూపించారంటే ఆయన పరువు పోయినట్లే అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు ధర్నాకు దిగారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. తమకు శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి హాజరైన



హరీశ్ రావు మాట్లాడుతూ, ఆర్ఎంపీ, పీఎంపీలపై వేధింపులు ఆపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎంపీలను భయపెడుతోందని ఆరోపించారు. వారిపై ఉన్న అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.